

# దేవరహస్యం

కె.కె.మీనన్

పోలీస్ ఆఫీసర్ పరంధామం తెలతెల్లవారకముందే లేచి ఆసనాలు వేశాడు, బస్కీలు తీశాడు. వేడివేడి నీళ్ల స్నానం చేసి గంట సేపు వేంకటేశ్వరస్వామి పటం ముందు ఒంటికాలు మీద జపం చేసి, నామాలు ధరించి పోలీస్ వేషం వేసుకున్నాడు.

పరంధామంగారి సతీమణి అప్పటికింకా నిద్రలేచి వుండదు. పిల్లలు డిటెక్టివో, సెక్సు నవలో చదూకుని అప్పుడే పడుకుని వుంటారు. వారి ప్రియురాలు మాత్రం ఆపాటికి అన్నీ ముగించుకుని తులసి కోట చుట్టూ తొలి చుట్టు తిరిగేసి వుంటుందని ఆయన అంతరాత్మ తొందర పెట్టింది.

పరంధామంగారు జీపు ఎక్కి కూర్చోగానే అది రాజఠీవితో కదిలి ప్రియురాలి ఇంటివైపు బయల్దేరింది. ఆ యింటికి తిరిగే మలుపులోనే ఆంజనేయ స్వామి ఆలయం వుంది. మున్సిపాలిటీ బండిలాగ అక్కడ ఆగిపోయింది జీప్.

పరంధామం జీపు దిగి గుడి ముందుకు వచ్చి కాలిబూట్లు విప్పి, మేజోళ్లు తీసి ముమ్మారు గుడి చుట్టూ ప్రదక్షిణం చేసి గుడిలోకి వచ్చి గంట ముమ్మారు మోగించి దేవుడి వైపు చూసి, మళ్ళీ కళ్లు మూసుకుని దణ్ణం పెట్టుకుని, పూరేకులు చెవిలో పెట్టుకుని, కళ్ల జోడు తీసి కుంకుమ అద్దుకుని మళ్ళీ కళ్ల జోడు పెట్టుకుని మళ్ళీ ఓసారి దేవుణ్ని తేరిపార చూసి చెంపలు వాయించుకుని జీప్ ఎక్కాడు. గుళ్లో కోరుకున్న వరాల్నే మరోసారి మననం చేసుకునే లోపు జీపు ప్రియురాలు పారిజాతం యింటి ముందు ఆగింది.

జీప్ ఆగిన చప్పుడు వినగానే పారిజాతం హడావుడిగా హారతి పట్టుకుని అతనికి ఎదురొచ్చింది. పరంధామంగారు హారతి కళ్లకి అద్దుకుని ప్రసాదం తీసుకుని రెండు కళ్లకూ స్పృశించి నోట్లో వేసుకున్నాడు. కళ్ల జోడు తీసి మళ్లీ, ఆవిడ బొట్టు పెట్టింది.

"ఈ సారి కూడా మీకు విజయం తప్పకుండా కలుగుతుంది– ఆ గజదొంగ దొరికి

పోతాడు. మీకు మళ్లీ పోలీస్ మెడలు, ప్రమోషనూ..." ఆ సరసుడు ఏం చేశాడో ఏమో ఆ పైన మరి మాట్లాడలేక పోయింది పారిజాతం. ఆ తర్వాత అతని చెవిలోని పూరేకులు తీసుకుని కళ్లకద్దుకుని తడియారని కురుల్లో తురుంకుంది

"వెళ్లనా మరి" అన్నాడు ముద్దుగా.

"క్షేమంగా వెళ్లి లాభంగా రండి"— అని సాగనంపింది.

* * * *

దేశంలో పేరు పొందిన ఒక గజదొంగ ఆ పరిసర అడవుల్లో తిరుగుతున్నాడని పోలీస్ కేంద్రానికి వార్తలొచ్చేయి. అందుకు దృష్టాంతరంగా రెండుమూడు దోపిడీలు కూడా జరిగేయి. దాంతో ప్రభుత్వం నుంచి ఘాటైన తాఖీదులు వచ్చేయి. అలాంటి కేసుల్ని అతి సాహసంగా నిర్వహిస్తాడని పేరు పొంది పోలీస్ మెడల్ కూడా ఆర్జించుకున్న పరంధామంకు ఆ కేసును అప్పగించేరు.

* * *

మూడు జీప్‌లు అడివి దారి పట్టేయి. ముందూ వెనుకా సాయుధ పోలీసు బలగం ఆజ్ఞయే తరవాయి అన్నట్లు సిద్ధంగా వుంది. పరంధామం మధ్య జీప్‌లో సుఖాసీనుడై వున్నాడు. కాకీ టోపీ నీడలో తెల్లటి నామాలకి కింద ఎర్రటి కళ్లు రెండూ దీక్షగా పరిసరాలని పరిశీలిస్తున్నాయి. జీప్‌లు అడివి మధ్యకు వెళ్లేక కొండ నుంచి రెండు తుపాకి కాల్పులు వినిపించేయి. వెంటనే పోలీసుల ఎదురు కాల్పుల గాల్లో దూసుకు పోయాయి.

తర్వాత మౌనం.

జీప్‌లు ఫారెస్ట్ రెస్ట్ హౌస్‌కు వెళ్లి పోయేయి.

రెస్ట్‌హౌస్‌లో మూడు రోజులు మకాం వేసినా దొంగల జాడ పసిగట్టలేక పోయాడు పరంధామం. కాని ఓ మహత్తర విషయాన్ని మాత్రం తెల్సుకున్నాడు. అక్కడ, ఆ కీకారణ్యంలో, క్రూర మృగాల మధ్య ఓ స్వామిజీ తపస్సు చేసుకుంటున్నాడట ఎన్ని రోజుల్నుంచో అలా దీర్ఘ సమాధిలోనే వున్నాడుట!! ఈ రోజే కళ్లు తెరుస్తాడని శిష్యులు చెప్పారుట. ఈ వార్త తన వేగులు మోసుకు రాగానే హుటాహుటిని బయల్దేరేడు పరమ భాగవతోత్తముడు పరంధామం. ఆ వార్త అబద్ధం కాదు. ఓ పెద్ద మారేడు చెట్టు కింద యోగ ముద్రలోవున్న ఓ ఆజాను బాహువుని చూసి తన భక్తి ప్రవృత్తిని నిగ్రహించుకోలేక సాష్టాంగ ప్రమాణం చేయబోయాడు. కాని శిష్యులు వారించేరు.

"ఇప్పుడు కాదు. మరి కొన్ని క్షణాల్లో కళ్లు తెరుస్తారు అప్పుడు" అన్నారు.

ఆ కొద్ది క్షణాలూ కొన్ని యుగాలుగా గడిచేయి పరంధామంకు. స్వాముల వారు ఎలాగైతే కళ్లు తెరిచేరు. తెరవడమే తడవుగా ఆయన ముందు సాగిల పడిపోయాడు పరంధామం.

ఆ యన్ని స్వహస్తాలతోనే లేపేరు స్వామిజీ

"ధన్యుణ్ని స్వామీ" అన్నాడు పరంధామం పౌరాణిక ధోరణిలో.

"నీవో బృహత్తర కార్యం మీద ఒచ్చావు నాయనా. అది సఫలమౌతుంది. ఇదిగో..." అని చేయి పైకెత్తి "ఓం"

అని గుప్పిలి విప్పారు చేతిలోకి ఓ ఆపిలు వచ్చింది.

"ఇదే నీకు నా ఆశీర్వాదం తీసుకో నాయనా" అని చేతి కిచ్చేరు

మహాప్రసాదంగా స్వీకరించేడు పరంధామం.

పరంధామంకు మెరుపులా ఓ ఆలోచన తట్టింది. తట్టడమే తడవుగా

"స్వామీ..." అని పలకరించలేడు.

"ఏం నాయనా"

"తమరు ఇలా జనశూన్యమైన అరణ్యాల్లో నివసించటం ఎవరికి లాభం స్వామీ పట్టణానికి వచ్చి ప్రజలకు తమ ఆశీస్సులు అంద చేయకూడదా స్వామీ"

స్వాముల వారు కళ్లు మూసుకుని, తెరిచి "అదే మంచిదిలా వుంది నాయనా! ఈ నాటితోనే నా తపస్సు ముగిసింది. చూద్దాం. అయినా నాలాంటి సన్యాసికి ఆదరణ ఎక్కడ లభిస్తుంది నాయనా" అన్నారు అరమోడ్పు కన్నులతోనే.

ఆ మాటకి తలకొట్టేసి నట్టయింది పరంధామంకు.

"అలా అనకండి స్వామీ. నేను వున్నాను. నా వెనక ఎంతో మంది ధనిక భక్తులున్నారు. పెద్ద వుద్యోగులున్నారు. మేమంతా కలిసి తమకో ఆశ్రమం కట్టిస్తాం" అని ప్రకటించేడు.

"అంతకంటేనా నాయనా". అన్నారు స్వాముల వారు అభయ ముద్రని అభినయిస్తూ.

* * *

ఊరి చివర ప్రశాంత వాతావరణంలో ఓ ఆశ్రమం వెలిసింది. అక్కడ క్షయ ఆస్పత్రి కట్టాలనే ప్రతిపాదన వుండేది. కాని ఉన్నతోద్యోగుల భక్తికి చిహ్నంగా అక్కడ ఆశ్రమం మాత్రమే ఏర్పడింది.

> అత్యావసర పరిస్థితిలో జరిగిన సంగతులు చాలా వరకూ కాంగ్రెస్ పార్టీ సభ్యులకే తెలియలేదు.
>
> — వై. బి. చవాన్.

ఆ ఆశ్రమం భక్తులతో నిరంతరం కళకళలాడుతూ వుంటుంది. పరంధామంగారి ప్రియురాలు పారిజాతం రేయింబవళ్ళు స్వామి సేవ చేసి తరిస్తోంది. పారిజాతాన్ని స్వాముల వారి సన్నిధికి చేర్చి వెంకటేశ్వర స్వామికి నిలువు దోపిడీ ఇచ్చినంత సంబర పడి పోతున్నాడు పరంధామం.

పారిజాతం మాటంటే స్వామికి వేద వాక్కు. అంచేత భక్తులకు స్వామి వారి కంటే పారిజాతం అంటేనే భక్తి మిక్కుటం.

నిరంతరం ఆశ్రమంలోకి ప్రవహించే కానుకలతోటీ, డిబ్బీలు నిండిపోతున్న డబ్బుతోటీ, రోజురోజుకీ పెరిగి పోతున్న స్త్రీ పురుష భక్త కోటి తోటీ స్వామీజీ చాలా ప్రశాంతంగా, ప్రసన్నంగా జీవితాన్ని నెట్టేస్తున్నారు.

కాని ఒక్క విషయం మాత్రం ఆయనకి ఇప్పటికీ అర్థం కాలేదు అర్థం అయినట్లు అనిపించినప్పుడు మాత్రం :

"ఇంత సుఖమైన మార్గం వుండగా ఇంత కాలంనించీ ఆ ముళ్లదారిలో ఎందుకు పరుగెత్తేను" అని ఆత్మ విమర్శ చేసుకుంటూ వుంటారు స్వాముల వారు. *